www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 8 అక్టోబర్ 2025
5
తిరుపతి



ఎస్వీ జూ పార్కులో జాగ్వార్ కుశ మృత్యువాత



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 2019లో హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్ నుండి శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాలకు తీసుకువచ్చిన జాగ్వార్ కుశ మంగళవారం ప్రమాదవశాత్తు మరణించినట్లు జూక్యూరేటర్ సెల్వం ఓ ప్రకటనలో తెలిపారు. జాగ్వార్ కుశ వయసు 15 సంవత్సరాల మూడు నెలలు దాటిన కుశను ఎప్పటిలాగే ఆవరణలోకి విడిచి పెట్టారు. ప్రమాదవశాత్తు ఒక చెట్టుకు చిక్కుకుపోయి చనిపోయి కనిపించిందన్నారు. ఎస్వీ వెటర్నరీ విశ్వవిద్యాలయంలోని పాథాలజీ విభాగం పాథాలజిస్టులు పోస్టుమార్టం నిర్వహించి, కుశ పోస్టుమార్టం నివేదికలో మరణానికి కారణం హైపర్ వాల్మీక్ షాక్, ఆస్ఫిజియా అని నిర్ధారించారన్నారు. అనంతరం జాగ్వార్ కుశ మృతదేహాన్ని ఖననం చేశారు.

గవాయ్‌పై దాడి రాజ్యాంగానికే అవమానం

ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుల ధ్వజం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ, యంత్రాంగం: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై అవమానకరమైన పద్ధతిలో రాజ్యాంగ వ్యతిరేకి, దేశద్రోహి, సుప్రీంకోర్టు న్యాయవాది తన చెప్పుతీసి విసరడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ధ్వజమెత్తారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఈ దాడిని నిరసిస్తూ దళిత, ప్రజాసంఘాల నాయకులు నిరసనలు తెలిపారు. తిరుపతి బాలాజీ కాలనీలోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి జిల్లా కోర్టు వరకూ కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన







ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య, అంబేద్కర్ భవన్ ఛైర్మన్ పి.పరమశివం, టిటిడి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగసంఘం అధ్యక్షులు డాక్టర్ ఎం.ప్రసాదరావు, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు చరిత్రలో మొదటిసారి ఇలాంటి సంఘటనలు జరగడం యావత్ జాతి సిగ్గుతో తలదించుకునేలా ఉందన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా అమలు చేయడానికి, నిబద్దతతో కృషి చేస్తున్న భారత న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై సనాతనవాది, భారత రాజ్యాంగ వ్యతిరేకి రాకేష్‌ను అరెస్టు చేసి, ఊపిరి ఉన్నంత వరకూ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై భారత రాష్ట్రపతి ముర్ము స్పందించి, సనాతనవాదులను, దేశద్రోహులను కఠినంగా శిక్షించడానికి రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన న్యాయమూర్తికి రక్షణ లేని దుస్థితిలో మోడీ ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత గొడుగుచింత గోవిందయ్య, ఎ.సుబ్రమణ్యం, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, సిపిఐ నాయకులు పద్మనాభరెడ్డి, విజయలక్ష్మి, దళితప్రజాసంఘాల నాయకులు ధనశేఖర్, కేశవులు, డాక్టర్ మునిరత్నం, శ్రీనివాసులు, జయచంద్ర పాల్గొన్నారు.

- క్యాంపస్‌లో.. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం బహుజన ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త ఆద్వర్యంలో వర్సిటీ ప్రధాన ముఖద్వారం ఎదుట అంబేద్కర్ విగ్రహం ముందు లా కళాశాల విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందితో నిరసన తెలిపారు. ఆచార్య పిసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి నేటికి 78 ఏళ్లయినా దళిత బడుగు బలహీన వర్గాలవారిపై ఎక్కడో ఒకచోట అవమానాలు, అగత్యాలు, అణచివేతలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతమాకుల పుణ్యమూర్తి మాట్లాడుతూ సుప్రీంకోర్టు జడ్జికే ఇంతటి దుర్మార్గమైన అవమానం జరిగితే, సామాన్యుల పరిస్థితి ఏంటన్నారు. ఈ కార్యక్రమంలో రఘురాములు, రాజేంద్రప్రసాద్, వాసుదేవరావు, సామ్రాజ్, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

- ఎస్వీయూ ఎంబిఎ కళాశాల ఎదుట.. ఎస్ఎఫ్ఐ, ఐసా, నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ సంఘాల ఆద్వర్యంలో నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వ విద్యాలయాల కోకన్వీనర్ అశోక్‌కుమార్, ఐసా జిల్లా కార్యదర్శి చిన్నా, నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సుందర్‌రాజు మాట్లాడుతూ దేశ ప్రధాన న్యాయమూర్తిపై దాడి దేశానికే అవమానకరమని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి దాడులు మరింతగా పెరుగుతున్నాయన్నారు. నరసన్న, ఆర్.మోహన్, కుమార్ పాల్గొన్నారు.

- గూడూరులో.. కెవిపిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు పామంజి మణి, గుర్రం రమణయ్య, గండికోట మధు తదితరులు పాల్గొన్నారు.

- సత్యవేడులో.. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో గవాయిపూపై ఘటనను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఖండించారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఈ ఘటనను ఖండించాలని పిలుపునిచ్చారు. రమేష్, అరుణాచలం, తిరుమలరెడ్డి, కృష్ణయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- పుత్తూరు టౌన్‌లో.. అంబేద్కర్ భవనం నుంచి కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి అపరంజి, కోశాధికారి కుప్పయ్య నేతృత్వం వహించారు.

నారావారిపల్లిలో నారా కుటుంబం

- తమ్ముడు ప్రథమ వర్ధంతికి చంద్రబాబు హాజరు
- నారా రామ్మూర్తి స్మృతివనం వద్ద నివాళి



అభివాదం..



అభిమానం..



నివాళి..

ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, నారావారిపల్లిలో ఒక్కరోజు పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం కుటుంబంతో సహా విచ్చేశారు. ఎ.రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జేసీ శుభంబన్సల్, కమిషనర్ మౌర్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎంఎల్ఎలు సాదర స్వాగతం పలికారు. నారావారిపల్లిలోని సొంత ఇంట్లో నారా రామ్మూర్తి సంవత్సరీక కార్యక్రమం సందర్భంగా తమ్ముడు కొడుకు, హీరో నారా రోహిత్‌తో పూజలు చేయించారు. నారా రామ్మూర్తి స్మృతివనంవద్ద నివాళి అర్పించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి, కుటుంబీకులతో కలిసి భోజనం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. అనంతరం రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచే చంద్రబాబు, నారా లోకేష్ బయల్దేరి విజయవాడకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, డాక్టర్ థామస్, మురళీమోహన్, ఆదిమూలం, తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, చుడ ఛైర్మన్ హేమలత, శాప్ ఛైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సి.ఆర్.రాజన్, మాజీ ఎంఎల్‌సి దొరబాబు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ ఉన్నారు.

డిసిఎంఎస్ ఛైర్మన్‌కు లోకేష్ నివాళి

ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ నారావారిపల్లి స్వగ్రామం నుంచి ఉదయం 7.26 గంటలకు బయల్దేరి రోడ్డుమార్గాన పనపాకం వరకూ ప్రజలకు అభివాదం చేస్తూ డిసిఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు స్వగ్రామం గడ్డంవారిపల్లికి చేరుకున్నారు. పల్లినేని సుబ్రమణ్యం నాయుడు చిత్రపటానికి మంత్రి నారా లోకేష్, ఎంఎల్‌ఎ పులివర్తి నాని పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పనిగంటల పెంపు
బిల్లు రద్దు చేయాలని నిరసన



పని గంటల పెంపును నిరసిస్తూ ర్యాలీ చేపట్టిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపిన పని గంటల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపు మేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.హేమలత మాట్లాడుతూ పరిశ్రమల్లో, ఫ్యాక్టరీల్లో 8 గంటల పనిని 13 గంటలకు పెంచుతూ క్యాబినెట్‌లో బిల్లును ఆమోదించడం చాలా దుర్మార్గమైన విషయమన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా ఆమోదించిందని, వీటిని అమలు చేయడంలో భాగంగానే రాష్ట్రంలో పని గంటల పెంపు అన్నారు. పని గంటలు పెంచి కార్మికుల శ్రమను యాజమాన్యాలు మరింత దోచుకోడానికి అవకాశం కల్పించిందన్నారు. ఎక్కువ సెలవులు పొందేలా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పడం కార్మికులను మోసగించడానికేనన్నారు. కర్నాటకలో బిజెపి ప్రభుత్వం 2023లో ఫ్యాక్టరీల చట్టానికి సవరణ చేసి పని గంటలు రోజుకు 12 చేసి, వారానికి 48 గంటల పని కొనసాగుతుందని, వారం లోపే 48 గంటలు పూర్తయితే మిగతా రోజులు వేతనంతో కూడిన సెలవు దినాలుగా పరిగణించబడతాయన్నారు. అయితే ఆచరణలో రెట్టింపు స్థాయిలో దోపిడీ జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కనీసం కార్మిక సంఘాలతో చర్చించకుండా నేరుగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. శాసనమండలిలో మెజార్టీగా ఉన్న వైసిపి శాసనసభ్యులు బిల్లును వ్యతిరేకించకుండా వాకౌట్ చేయడంతో కార్మికులకు తీవ్ర నష్టం చేసే ఈ బిల్లు ఆమోదం పొందిందన్నారు. బిజెపితో ప్రత్యక్షంగా, పరోక్షంగా అధికార తెలుగుదేశం, జనసేన, ప్రతిపక్ష వైసిపి లోపాయికారి ఒప్పందాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, కె.వేణుగోపాల్, పి.బుజ్జి, ఎస్.మాధవ్, చిన్న, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లి గేటుకు మోక్షం

- రైలొస్తే ఆగాల్సిన పనిలేదు



అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: శెట్టిపల్లి ఊరు ఏర్పడి ఎనిమిది దశాబ్దాల పైమాటే.. అంటే స్వాతంత్ర్యం రాకముందే ఏర్పడిందన్నమాట. సిఆర్ఎస్ అభివృద్ధి వెనుక శెట్టిపల్లి గ్రామ ప్రజల కృషి ఎంతో ఉంది.. వందల ఎకరాల భూమిని త్యాగం చేసి సిఆర్ఎస్‌కు ఇచ్చారు. అయితే ఆ ఊరికి వెళ్లాలంటే రైలొచ్చిందంటే వాహనాలన్నీ పది నిమిషాల పాటు ఆగాల్సిందే. తిరుపతికి కొత్త రైళ్ల సర్వీసులు పెంచడంతో రాకపోకలు మరింత పెరిగాయి. దీంతో శెట్టిపల్లివాసులు ఈ గేటు వల్ల ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఒక్కోసారి అర్జెంట్‌గా ఉద్యోగాలకో, విద్యాలయాలకో, పరీక్షలకు వెళ్లేవారు ఈ గేటు వద్ద టెన్షన్ అనుభవించక తప్పదు. 30 ఏళ్ల క్రితం మంగళంలో క్రిష్ణారెడ్డి కోళ్లఫారాలకు ఫీడ్ తీసుకెళ్లేందుకు ఓ లారీ దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఆ ప్రాంతంలో పెద్దఎత్తున నిరసనలొచ్చాయి. ఆ ఘటనతో శెట్టిపల్లి గేటు ఏర్పాటయ్యింది. తిరుచానూరు రైల్వేస్టేషన్ కొత్తగా రావడంతో తిరుపతి నుంచి తిరుచానూరు వరకూ ఉన్న రైల్వేగేట్లన్నీ అండర్ బ్రిడ్జిగా చేయాలని గతంలో ప్రతిపాదనలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కాటన్‌మిల్లు, శెట్టిపల్లి గేట్లకు మోక్షం లభించనుంది. కాటన్‌మిల్లు వద్ద ఎల్ ఆకారంలో ఏర్పాటు చేసే గేటుకు రూ.6 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. అలాగే శెట్టిపల్లి అండర్ 'వే'కు రూ.5 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. తిరుపతికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఈ పనులను చేస్తున్నారు. రెండు వారాలుగా యుద్ధ ప్రాతిపదికన శెట్టిపల్లి గేటు వద్ద పనులు జరుగుతున్నాయి. త్వరలోనే దీపావళి కానుకగా శెట్టిపల్లి ఊరికి ఈ గేటు బాధల నుంచి విముక్తి లభించ నుంది. ఈ రూటు మంగళం, బిటిఆర్ కాలనీవాసులకూ అనువుగా ఉండనుం ది. అండర్ బ్రిడ్జి లోపలి భాగం 15 అడుగుల ఎత్తు ఉన్నందున ఎత్తయిన బోరు లారీలు, గడ్డివాము లారీలు వచ్చే అవకాశం లేదని స్థానికులు వాపోతున్నారు.

నవోదయ ఎంట్రన్స్ ఎగ్జామ్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : 2026-2027 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతులలో జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును అక్టోబర్ 21, 2025 వరకు పొడిగించారు. ఈ విషయాన్ని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు,విశ్వం విద్యా సంస్థల అధినేత డా. యన్. విశ్వనాథరెడ్డి వెల్లడించారు. వివరాలకు విశ్వం సైనిక్, నవోదయ కోచింగ్ ఇనిస్టిట్యూట్‌ను సంప్రదించవచ్చని, లేదా 86888 88802 / 93999 76999 నంబర్లను సంప్రదించాలనిసూచించారు.


జిల్లాకో
కల్తీమద్యం కర్మాగారమా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): కూటమి ప్రభుత్వం అబద్ధపు బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలవుతున్నాయా అన్నది ప్రశ్నగా మిగులుతోందని, ఇక కల్తీ మద్యం తయారీ చేస్తూ జిల్లాకో కర్మాగారాన్ని ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్ర బాబు బాబు ప్రణాళికలు సిద్ధమయ్యాయా అని వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన గవాయిపై జరిగిన దాడిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6 హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

20న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం



ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 20వ తేదీన దీపావళి ఆస్థానాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. దీపావళి పర్వదినాన ఉదయం 7 నుండి ఉదయం 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం జరుగుతుంది. ఆస్థానంలో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి ఘంటా మండపంలో ఏర్పాటుచేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారిని కూడా స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ ఆభిముఖంగా వేంచేపు చేస్తారు. ఆ తరువాత స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది. సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలను టిటిడి రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

డప్పుకళాకారులకు పింఛన్ రూ.7 వేలివ్వాలి



ప్రజాశక్తి - రేణిగుంట : డప్పుకళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, పింఛన్ ఏడువేలు ఇవ్వాలని డప్పుకళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఒకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. డప్పుకళాకారుల మండల మహాసభ ఎంపిడిఒ కార్యాలయం వద్ద జరిగింది. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య మాట్లాడుతూ డప్పుకళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలపి, రెండు ఎకరాల భూమి, బస్సుల్లో, రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. పింఛన్‌ను ఏడువేలకు పెంచి ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోతే పది లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలన్నారు. సహజ మరణానికి ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. కళాకారులకు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గుడ్లూరు పరిశ్రమకు స్వచ్ఛాంధ్ర అవార్డు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతిష్టాత్మక స్వచ్ఛాంధ్ర అవార్డును అందుకోవడం తమకు ఎంతో గర్వకారణం' అని గుడ్లూరు ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ గుడ్లూరు జగన్‌మోహన్ అన్నారు. ఈ గుర్తింపు ఇచ్చినందుకు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు, పరిశ్రమల శాఖకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో పర్యావరణ పరిరక్షణలో మరిన్ని ఉత్తమ పద్ధతులను అవలంబించడానికి ఈ అవార్డు తమకు ప్రేరణ ఇస్తుందన్నారు. రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ప్రముఖ చిన్నతరహా పరిశ్రమ గుడ్లూరు ఇండస్ట్రీస్ పర్యావరణ బాధ్యత పట్ల అచంచల నిబద్ధతను ప్రతిబింబిస్తుందని చెప్పారు. పర్యావరణానికి అనుకూలమైన ఉత్పత్తి విధానాలు, వ్యర్థ నిర్వహణ, శుభ్రమైన శక్తి వినియోగం వంటి అంశాలలో విశేష కృషిని గుర్తిస్తూ ఈ అవార్డు ప్రదానం చేశారన్నారు. తిరుపతి జిల్లాలో నమోదైన మొత్తం 55వేల పైచిలుకు ఎంఎస్ఎంఇలలో గుడ్లూరు ఇండస్ట్రీస్‌కు ఈ గుర్తింపు వచ్చిందన్నారు.

ఢిల్లీ నుంచి.. గల్లీ దాకా..
ఎర్రచందనం స్మగ్లింగ్

ఢిల్లీలో ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.10 కోట్ల విలువ చేసే 10 టన్నుల 'ఎ గ్రేడ్' ఎర్రచందనం దుంగలను దేశ రాజధాని న్యూఢిల్లీలో పట్టుబడ్డాయి. ఏపి ఇంటెలిజెన్స్ పోలీసుల ఖచ్చితమైన సమాచారంతో న్యూఢిల్లీ తుగ్లకాబాద్‌లో గల గోదాముపై ఎపి పోలీసులు, ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్, ఢిల్లీ పోలీసులు కలిసి మెరుపుదాడులు నిర్వహించారు. హైదరాబాద్, ముంబాయికి చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసుల అదుపులో మహ్మద్ ఇర్ఫాన్, అమిత్ పవార్ సంపత్ ఉన్నారు. హర్యానాకు చెందిన స్మగ్లర్ పరారీలో ఉన్నాడు. ఎర్రచందనం దుంగలను తిరుపతి నుంచి ఢిల్లీకి అక్రమంగా తరలించినట్లు సమాచారం. జూన్ నెలలో అందిన సమాచారం ఆధారంగా ఆపరేషన్‌ను పోలీసులు ప్రారంభించారు.

ఎర్రచందనం వాహనం సహా స్మగ్లర్లు అరెస్టు



యర్రావారిపాలెం మండలం, పులకుంట్లపల్లి పరిసరాల్లో స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: రాత్రి పెట్రోలింగ్ తనిఖీల్లో భాగంగా పులకుంటపల్లికి పోవు మట్టి రోడ్డు సమీపంలో తలకోన రోడ్డు మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా వాహనంతో సహా ఎర్రచందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు అటవీ శాఖ అధికారి ఎన్. వెంకటరమణ మీడియాకు తెలిపారు. ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తలకోన రోడ్డు మార్గంలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా అనుమానం వచ్చి కారును ఆపగా స్మగ్లర్లు దిగి పారిపోవడానికి ప్రయత్నించారని తెలిపారు. సిబ్బంది చుట్టుముట్టగా తమిళనాడుకు చెందిన చండీరణ్ యజూహుమలై, తరుమాన్ సమీక్కన్ అనే ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. కారును పరిశీలించగా ఆరు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు పేర్కొన్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం విలువ సుమారు 10 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ముద్దాయిలను కోర్టుకు హాజరుపరచగా 11 రోజులు పాటు రిమాండ్ విధించారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం ముమ్మరంగా గాలింపు చేపడుతున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఓ సలావుద్దీన్, ఎఫ్ బి ఓ లు రాజేష్ కుమార్, ప్రదీప్ చాంద్, రవి, శంకర్ డ్రైవర్, రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటితో ఆరోగ్యం

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశం బుచ్చినాయుడుకండ్రిగ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం వైద్యాధికారి డాక్టర్ కవిత, ఆరోగ్య అధికారి డివిఎన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నోడల్ అధికారి జ్యోతి పర్యవేక్షణలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం ఏర్పాటు కావాలంటే గ్రామాలలో శుభ్రత, పరిశుభ్రత, సురక్షిత తాగునీరు వీటిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. శరీర, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌సిసి కెడెట్లకు అభినందన



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎన్‌సిసిలో విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, మానసిక దృఢత్వం అలవాటవుతాయని పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. అక్టోబర్ 8 నుంచి 17 వరకు హైదరాబాద్‌లో జరిగే ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్ శిక్షణకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు విద్యార్థిని, విద్యార్థులు ఎంపికయ్యారు. తృతీయ సంవత్సరం బి.కామ్ విద్యార్థి శేషాద్రి, బీఏ విద్యార్థి లావణ్య, ద్వితీయ బి.ఎస్సీ విద్యార్థి గీతిక శిక్షణకు ఎంపిక కావడం తమ కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ శిక్షణలో ఎంపికైన వారు ఢిల్లీ రిపబ్లిక్ డే క్యాంపులో పాల్గొంటారని ఎన్‌సిసి అధికారి డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వాసవి, డాక్టర్ వెంకటేశ్, డాక్టర్ గాయత్రి తదితర అధ్యాపకులు శిక్షణకు ఎంపికైన ఎన్‌సిసి విద్యార్థులను అభినందించారు.


క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: చేవేరా ఫౌండేషన్, రాయల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. గూడూరు, అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో చేవేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రెండ్ షిప్ కప్ క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేవేరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఎం.ఎల్.సి, నాయకులు మనపాటి రవీంద్ర బాబు క్రికెట్ ఆడి పోటీలు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మునిరాజ్, సురేష్ బాబు, హాకీ కోచ్ దీపక్ ఆకాష్, ఎం.రాజేష్ కుమార్, నజీర్, కిషోర్, నందవరం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శ్రీదేవి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండల పరిషత్ నూతన ఎంపీడీవోగా శ్రీదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న వాణి పదోన్నతిపై నగరి ఎంపిడిఓగా వెళ్లడంతో, పిచ్చాటూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్‌డీగా పని చేస్తున్న శ్రీదేవి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎంపీడీవోగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న పంచాయతీల అభివృద్ధిపై పరిశీలించి అవసరమైన పనులు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

పేర్నాటికి ఘనస్వాగతం



ప్రజాశక్తి - కోట: కోట మండలానికి చెందిన సీనియర్ వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా నియమితులైన నేపథ్యంలో తొలిసారిగా తన స్వగ్రామమైన అల్లంపాడుకు రావడంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంగళవారం వైసీపీ నాయకులు, చిల్లకూరు సాయిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యానగర్ నుండి కోట పట్టణం మీదుగా అల్లంపాడు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, దువ్వూరు వెంకట రమణారెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ప్రజాశక్తి - క్యాంపస్: ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాన్ని విశ్వవిద్యాలయంలోని వాల్మీకి విగ్రహం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉప కులపతి ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణం ద్వారా జీవితకర్తవ్యాన్ని వర్ణించారన్నారు. రిజిస్ట్రార్ రంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో విశ్వవిద్యాలయ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొ.ఎస్. దక్షిణా మూర్తి శర్మ మాట్లాడుతూ రామాయణం మానవ ధర్మాలకు దర్పణమన్నారు. విశ్వవిద్యాలయ సిడిఇ డైరెక్టర్ సాహిత్య విభాగ ఆచార్యులు ప్రొ.సి.రంగనాథన్, కార్యక్రమ సంయోజకులు, సాహిత్య సంస్కృత స్కూల్ డీన్ ప్రొ.సత్యనారాయణాచార్యులు, కార్యక్రమ సహ సంయోజకులు విభాగం ఆచార్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రామాయణాన్ని చదవాలని సూచించారు.

రవిశంకర్ రెడ్డికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్: యస్వీయు సివిల్ ఇంజనీరింగ్ పరిశోధక విద్యార్థి బి.రవి శంకర్ రెడ్డికి డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసినట్లు సిఈ రాజు మాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్య డి.వి.ప్రసాద్ రావు పర్యవేక్షణలో "ఎక్స్‌పెరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ మెకానికల్ అండ్ డ్యూరబిలిటీ ప్రాపర్టీస్ ఆఫ్ హై యాష్ బేస్డ్ జియో పాలిమర్ కాంక్రీట్ బ్లెండెడ్ విత్ జిజిబిఎస్ అండ్ లైమ్ క్వార్ట్జ్ ఎట్ యాంబియంట్ టెంపరేచర్" అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించినట్లు వివరించారు.

గుండె మార్పిడి శస్త్ర చికిత్స సక్సెస్

● 63 ఏళ్ల రోగికి కొత్త జీవితం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : గుండె వైఫల్యంతో పోరాడుతున్న మదనపల్లికి చెందిన 63 ఏళ్ల రోగికి గుండె శస్త్ర చికిత్స విజయవంతం చేసినట్లు హెచ్ఓడి అండ్ లీడ్ కన్సల్టెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ డాక్టర్ చెప్పారు. ఒకప్పుడు చురుకుగా, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి తీవ్రమైన గుండెపోటు గుండెను దెబ్బతీసింది. అతనికి నిరంతర ఐవి ఇనోట్రోపిక్ థెరపీ (మిల్రినోన్) అవసరం అయ్యింది. అయినప్పటికీ పరిస్థితి క్షీణిస్తూ ఉండేది. గుండె మార్పిడి లేకుండా అతను ఒక సంవత్సరానికి మించి జీవించే అవకాశాలు చాలా తక్కువగా ఉండేవి. గుండె మార్పిడి కోసం వేచి ఉన్న జాబితాలో ఉండగా మదనపల్లి స్వస్థలానికి చెందిన సరిపోయే దాత గుండె అందుబాటులోకి వచ్చింది. దీంతో కొత్త హృదయాన్ని విజయవంతంగా అమర్చారు. దాత, గ్రహీత ఇద్దరూ ఒకే పట్టణానికి చెందినవారు కావడంతో కోల్డ్ ఇస్కీమియా సమయం గణనీయంగా తగ్గి, శస్త్ర చికిత్స విజయానికి అనుకూలంగా మారింది.

సిఐటియు జిల్లా మహాసభలు విజయవంతం చేయండి



ప్రజాశక్తి - పిచ్చాటూరు: 13 14 తేదీల్లో పుత్తూరులో జరగబోయే సిఐటియు జిల్లా మహాసభలకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిచ్చాటూరు మండలం ఆశా కార్మికుల సమావేశంలో ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ గతంలో కార్మికులు సమస్యల మీద పోరాటం చేసిన ఘనత సిఐటియుకు మాత్రమే ఉందన్నారు. కార్మికుల సమస్యలపై పోరాటాలకు ప్రణాళికలు సిద్ధం చేసేందుకు జిల్లా మహాసభ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆశా కార్మికులు రాధిక, మానస, రాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్ కుటుంబానికి సత్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : డెహ్రాడూన్ లోని ఆర్మీ యూనిట్ డైమండ్ సెలబ్రేషన్ మాజీ సైనికుడు, జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ కుటుంబాన్ని మంగళవారం ఘనంగా సత్కరించారు. జవాన్ గా దేశానికి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం డెహ్రాడూన్ దగ్గరగా ఉన్న హరిద్వార్, రిషికేష్ , పుణ్యక్షేత్రాలను దర్శించడానికి ఆర్మీ యూనిట్ ఏర్పాటుచేశారు.

జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు మొదటి సౌత్ జోన్ సీనియర్ లాక్రోస్ ఛాంపియన్ షిప్ 2025-26 రాష్ట్రస్థాయి లాక్రోస్ ఈవెంట్‌లో అక్టోబర్ 4,5వ తేదీల్లో కర్నూలులో జరిగిన ఈ క్రీడా పోటీల్లో రాణించి, నవంబర్ 28 నుంచి 30 వరకు జమ్ము కాశ్మీర్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీకి ఎంపికైనరని కళాశాల ప్రిన్సిపల్ డా. సి. భువనేశ్వరి వెల్లడించారు. కీడ్రాకారులను అభినందించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గెలుపొందిన విద్యార్థినిలు కె. శశిరేఖ, ఈ.సౌమ్య సిల్వర్ మెడల్ ద్వితీయ సంవత్సరం, సీఈసీ, ఎన్ పూజిత ప్రథమ సంవత్సరం బైపిసి సిల్వర్ మెడల్ సాధించారు.

వైసీపీ రాజకీయ పునాది కుట్రలే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) : చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు నియోజకవర్గం దేవళంపేటలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి అక్కడి సర్పంచి గోవిందయ్య ఉద్దేశపూర్వకంగానే నిప్పంటించినట్లు పోలీసుల విచారణలో నిర్ధారణ అయ్యిందని, సర్పంచి గోవిందయ్య వెనుక ఉండి ఈ ఘోర తప్పిదాన్ని చేయించిన వారిని విడిచిపెట్టబోమని ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ థామస్, పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్, ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్, సూళ్లూరుపేట శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి రెండు అడుగుల దూరంలోనే వైయస్సార్ విగ్రహం కూడా ఉందని, ఈ రెండు విగ్రహాలకు దూరంగా ఉన్న ఓ చిన్న పూరిపాకకు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నిప్పంటుకుంటే ఆ పూరిపాక దుకాణ నిర్వాహకురాలు సులోచనమ్మ సర్పంచి గోవిందయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన ఆ నిప్పులను అంబేద్కర్ విగ్రహానికి మళ్ళించి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వైసిపి ఈ ఘటనను వాడుకుంటూ తెలుగుదేశం పార్టీకి ఈ మచ్చ తేవాలని కుట్ర చేశారన్నారు. విచారణ చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో సర్పంచి గోవిందయ్యే అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారని తేల్చారన్నారు. ఇప్పుడు ఈ కుట్ర తతంగం బయటపడడంతో వైసిపి నీచ రాజకీయాలు ప్రజలకు తెలిసాయన్నారు. గోవిందయ్య అరెస్టు తర్వాత వైసిపి నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారని, గోవిందయ్య వెనుక ఎంతటి వారు ఉన్నా సరే చట్టం ముందు తలవంచక తప్పదని హెచ్చరించారు. విలేకరుల సమావేశం జరుగుతుండగా జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాజీ ఎమ్మెల్యే నారాయణస్వామిని పత్రికల్లో రాయలేని విధంగా ఉండే పదజాలంతో మాట్లాడటంతో ఒక్కసారిగా మీడియా అవాక్కు అయ్యేలా చేసింది. ఈ విలేకరుల సమావేశంలో చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు సిఆర్ రాజన్ పాల్గొన్నారు.

నేడు జాతీయ సహకార వర్కుషాపు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ఈ నెల 8,9 తేదీలలో తిరుపతిలోని తాజ్ హోటల్ వేదికగా జాతీయ సహకార మంత్రిత్వ శాఖ వర్క్ షాప్ నిర్వహణ జరగనున్నదని, ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేశామని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి సహకార మంత్రిత్వ శాఖ తీసుకున్న వివిధ కార్యక్రమాల అమలుపై సమీక్షించడానికి త్రైమాసిక సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమీక్ష సమావేశానికి జాతీయ సహకార మంత్రిత్వశాఖ సెక్రటరీ ఆశిష్ కుమార్ భుటాన్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

నేటి నుండి పింఛన్ల పునఃపరిశీలన

➤ ప్రత్యేక నిపుణులచే దివ్యాంగులు, ఆరోగ్య పింఛన్ల పరిశీలన

➤ హాస్పిటల్స్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయండి

: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దివ్యాంగుల, ఆరోగ్య పింఛన్లను పునః పరిశీలన చేయడానికి ప్రత్యేక నిపుణులచే జిల్లావ్యాప్తంగా బృందాలను ఏర్పాటు చేసినట్లు, పరిశీలన జరిగే ఆసుపత్రుల వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఈ మేరకు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి తగిన సూచనలను చేశారు. తిరుపతి రుయా హాస్పిటల్, శ్రీకాళహస్తి మరియు గూడూరు ఏరియా హాస్పిటల్స్ లో దివ్యాంగుల పెన్షన్లు, ఆరోగ్య (హెల్త్) పెన్షన్ల ప్రత్యేక నిపుణులచే పునఃపరిశీలన జరుగుతుందన్నారు. శానిటేషన్, త్రాగునీరు, ఆహార వసతి వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత విభాగ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం గతంలో అనర్హులుగా గుర్తించి, నోటీసులు జారీ చేయబడిన పెన్షన్ దారులు 30 రోజుల లోపు అప్పీల్ చేసుకున్నవారి పునఃపరిశీలన కోసం బుధవారం నుంచి రుయా హాస్పిటల్, శ్రీకాళహస్తి , గూడూరు ఏరియా హాస్పిటల్స్ లో ప్రత్యేక నిపుణులచే పరిశీలన జరుగుతుందన్నారు. పునః పరిశీలన కోసం లబ్ధిదారులను హాస్పిటల్ కు తరలించడం వంటి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బెడ్‌రిడెన్ హెల్త్ పెన్షన్ లబ్ధిదారులు ప్రయాణానికి అనుకూలంగా లేని సందర్భాల్లో 104, 108 అంబులెన్స్ సేవల ద్వారా వారిని హాస్పిటల్‌కు తరలించేందుకు ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కోఆర్డినేటర్ తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, పునఃపరిశీలన కార్యక్రమంలో ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్పష్టం చేశారు. ప్రతి హాస్పిటల్‌లో రోజుకు ఒక స్పెషలిస్ట్ డాక్టర్ ద్వారా ఆర్థో/లోకోమోటర్ (ఎముకల సమస్యలు)%-%30 మందిని, హియరింగ్ ఇంపెయిర్డ్ (వినికిడి లోపం)%-%30 మందిని, మెంటల్ రిటార్డేషన్ / మెంటల్ ఇల్నెస్%-%20 మందిని, విజువల్లి ఛాలెంజ్డ్ (దృష్టి లోపం)%-%20 మందినిలి పరిశీలించాలన్నారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ అడ్మిన్ సెక్రటరీలు, వెల్ఫేర్ సెక్రటరీలు లబ్ధిదారులకు నోటీసులు అందజేసి, హాస్పిటల్‌లో నిర్దిష్ట తేదీన హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అలసత్వం లేదా నిర్లక్ష్యం చూపించినా చర్యలు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డిఎల్డిఓలు, డిఎంహెచ్ఓ, పిసిహెచ్ఎస్, ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, ఎస్.వి. రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్, ఏరియా హాస్పిటల్ శ్రీకాళహస్తి, ఏరియా హాస్పిటల్ గూడూరు సూపరింటెండెంట్లు, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఏపీఎంసీ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

తిరుపతి ప్రయాణికులకు అలర్ట్

ఈ 10 రైళ్లకు స్టేషన్, టైమింగ్స్ మార్పు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం కీలక ప్రకటన జారీ చేసింది. తిరుపతి మీదుగా ప్రయాణించే 10 వీక్లీ ఎక్స్ ప్రెస్ రైళ్లకు టెర్మినల్ స్టేషన్‌ను మారుస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయా రైళ్ల టైమింగ్స్ లోనూ మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మార్పులు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయో కూడా దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. తిరుపతి నుంచి ప్రయాణాలు చేసే వారు ఈ మార్పులు గమనించాల్సి ఉంటుంది. ఆపరేషన్స్ కారణాలతో 10 ఎక్స్ ప్రెస్ రైళ్లకు తిరుపతి నుంచి తిరుచానూరుకు టెర్మినల్ స్టేషన్ మారుస్తూ దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 13 నుంచి జల్నా నుంచి తిరుచానూరుకు ప్రయాణించే రైలు నంబర్ 07609 రైలు రేణిగుంటలో 9.28కి, తిరుచానూరులో 10.45కు చేరుకుంటుంది. అలాగే ఈ నెల 13 నుంచి తిరుచానూరు నుంచి జల్నాకు వెళ్లే రైలు నంబర్ 07610 తిరుచానూరులో మధ్యాహ్నం 3.20కి బయలుదేరుతుంది. రేణిగుంటలో 3.35కు ఆగనుంది. ఈ నెల 15నుంచి చర్లపల్లి నుంచి తిరుచానూరుకు వచ్చే రైలు నంబర్ 07251 రేణిగుంటకు ఉదయం 5.58కి, తిరుచానూరుకు 8 గంటలకు చేరుకుంటుంది. ఈ నెల 15 నుంచి తిరుచానూరు నుంచి చర్లపల్లికి వెళ్లే రైలు నంబర్ 07252 తిరుచానూరులో సాయంత్రం 4.55కు బయలుదేరుతుంది. రేణిగుంటలో 5.14కు చేరుకుంటుంది. అలాగే ఈ నెల 11 నుంచి నాందేడ్ నుంచి తిరుచానూరుకు వచ్చే రైలు నంబర్ 07015 రేణిగుంటకు 10.28కి చేరుకుంటుంది. తిరుచానూరుకు 11.30కు చేరుకుంటుంది. అటు తిరుచానూరు నుంచి నాందేడ్ కు వెళ్లే రైలు నంబర్ 07016 రాత్రి 7.50కి తిరుచానూరులో బయల్దేరి రాత్రి 8.05కి రేణిగుంటకు చేరుకుంటుంది. ఈ నెల 9 నుంచి సికింద్రాబాద్ నుంచి తిరుచానూరు వచ్చే రైలు నంబర్ 07009 ట్రైన్ ఉదయం 8.58కి రేణిగుంటకు వచ్చి 10.30కి తిరుచానూరుకు చేరుకుంటుంది. అలాగే తిరుచానూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలు నంబర్ 07010 ట్రైన్ సాయంత్రం 4.40కి తిరుచానూరులో బయల్దేరి 4.55కి రేణిగుంటకు చేరుకుంటుంది. అలాగే ఈ నెల 12 నుంచి చర్లపల్లి నుంచి తిరుచానూరు వచ్చే రైలు నంబర్ 07017 ట్రైన్ ఉదయం 8.58కి రేణిగుంటకు చేరుకుని, 11.15కు తిరుచానూరు వెళ్తుంది. అలాగే తిరుచానూరు నుంచి చర్లపల్లికి వెళ్లే రైలు నంబర్ 07018 ట్రైన్ సాయంత్రం 4.40కి తిరుచానూరులో బయల్దేరి 4.55కు రేణిగుంటకు చేరుకుంటుంది. ఇతర స్టేషన్లలో మాత్రం ఈ రైళ్ల సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవు.

అన్నదానానికి రూ.50 వేలు విరాళం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లా, భీమునిపాడుకు చెందిన రామాంజనేయ రెడ్డి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఏఈఓ మోహన్‌కు అందించి, నిత్యాన్నదానానికి ఖర్చు చేయాల్సిందిగా కోరారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం కల్పించారు.

భోజన నాణ్యతలో రాజీపడొద్దు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతలో రాజీ పడొద్దని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వండిన భోజనాన్ని రుచి చేశారు. కూరగాయలు, సరుకుల నిల్వలను పరిశీలించారు. పేద విద్యార్థినులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే ఎమ్మెల్యే ఎమ్మెల్యే ద్వారా చర్యలు తీసుకునేలా చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, తహశీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో మంగళవారం ఉదయం విద్యుత్ హై వోల్టేజ్ సరఫరా కావడంతో కార్యాలయాల్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు, కంప్యూటర్లు, ఎలక్ట్రికల్స్ ఫ్యాన్లు కొన్ని కాలిపోయినట్లు సమాచారం. షార్ట్ సర్క్యూట్‌తో పేలినట్లు పెద్ద శబ్దం రావడంతో ఆఫీసులో ఉన్న అధికారులు, ప్రజలు భయభ్రాంతులకు గురై ఆఫీస్ బయటకు పరుగులు పెట్టారు. దీంతో స్థానిక తహశీల్దార్ జరీనా, విద్యుత్ అధికారులకు సమాచార ఇవ్వగా తక్షణమే స్పందించిన విద్యుత్ అధికారులు విద్యుత్ పోల్లో లైన్ ఆపివేసి, లైన్ తొలగించారు. అనంతరం మరమ్మతులు చేపట్టారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్ట్ నరసింగరావుపేట సెక్టారు పరిధిలో ఇందిరా నగర్, మిలిటరీ కాలనీ అంగన్వాడి కేంద్రాలలో పోషణ మాసం కార్యక్రమం సీ.డీ.పీ.వో మెహబూబి, ఏసిడిపివో శారదాంబల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ హైమావతి, అంగన్వాడి టీచర్లు డోర్కు, స్నేహలత, అరుణ కుమారి, విమలమ్మ, అనురాధ, సాయి చందన, గర్భిణీలు బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

విద్యతో సమాజ ప్రగతి

ప్రజాశక్తి -ఏర్పేడు : పేద, బలహీన వర్గాల కుటుంబాల పిల్లలకు విద్యలో అవసరమైన ప్రాథమిక సహకారం, పిల్లల్లో చదువుపై ఆసక్తి, ఉత్సాహాన్ని పెంపొందించేందుకు ఎస్.ఓ.ఎస్ సంస్థ కుటుంబ బలోపేత కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాలలో 10 గ్రామాలకు సంబంధించి 907 మంది విద్యార్థులకు రూ.7 లక్షలు వ్యయంతో పాఠశాల బ్యాగులను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా కార్యక్రమ బృంద సభ్యులు మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి తోడ్పడడం ద్వారా కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా బలపడతాయన్నారు. గ్రామాల కమ్యూనిటీ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో ఈ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

ఘనంగా మాజీ విసి జయంతి



ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు మొదటి వైస్‌చాన్సలర్ ఎస్. గోవింద రాజులు జయంతిని పురస్కరించుకుని, ఆయన విశ్వవిద్యాలయానికి అందించిన అమూల్య సేవలను స్మరించుకుంటూ బోధనేతర సిబ్బంది, నేతలు విశ్వవిద్యాలయంలో ఉన్న ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన పదవీ కాలం 02-09-1954 నుంచి 31-05-1964 వరకు పనిచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయు బోధనేతర సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని రామానుజపల్లిలో మంగళవారం నిర్వహించిన గంగమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సింగిల్ విండో చైర్మన్, ఆక్స్ ఫర్డ్ అధినేత చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి- రేణిగుంట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆదేశాల మేరకు ఆఫ్తాల్మిక్ నారాయణ స్వామి రేణిగుంట లోని ప్రభుత్వ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 451 మంది విద్యార్థులకు స్పష్టమైన దృష్టి కోసం కంటి చూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా 41 మందిలో దృష్టి స్పష్టంగా లేనట్లు గుర్తించారు. రేణిగుంట, బాలికల ఉన్నత పాఠశాలలో 643 మందికి పరీక్షలు నిర్వహించగా 62 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉంది. మొత్తం103 మందికి కళ్ళజోళ్ళు త్వరలోనే ఉచితంగా ఆ విద్యార్థులకు అందించడం జరుగుతుందని హెల్త్ సూపర్వైజర్ కామరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శంకరి, శ్యామల, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, ఆశాకార్యకర్తలు కళ్యాణి, శాంతి, విమల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిఎస్టి తగ్గింపుతో హర్షాతిరేకాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కేంద్ర ప్రభుత్వం వస్తు, సేవల పన్నును రెండు రకాలకు తగ్గించడంతో అన్ని వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నట్లు జీఎస్టీ అధికారి ముక్కంటి శ్రీనివాసులు పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గతంలో జీఎస్టీ ఐదు రకాలుగా ఉండేది అన్నారు. ప్రస్తుతం ఆ పన్నులను రెండు రకాలుగా కుదించడంతో అన్ని వర్గాలకు ఆదా అవుతున్నట్లుగా పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పన్నులు తగ్గించడం శుభ సూచికమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, ఎంపీడీవో పెంచల శ్యామ్, ఎంఈఓ బాలయ్య, రవిచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సును ప్రధానోపాధ్యాయులు రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తగ్గిన జిఎస్టి ద్వారా ప్రతి కుటుంబంలో సుమారు 15 వేల వరకు ఆదా ఉంటుందని తెలియజేశారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : జిఎస్‌టి సంస్కరణలు ప్రజలకు ఆర్థికంగా మేలు చేకూరుస్తాయని పాపా నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ జీఎస్టీలో మార్పులు రెండు పన్నుల స్లాబులు మాత్రమే ఉంచబడ్డాయన్నారు. కళాశాల కామర్స్ అధ్యాపకులు డాక్టర్ జలగం రామాంజులు మాట్లాడుతూ అల్పాదాయ వర్గాలకు, విద్యా, వైద్య రంగాలకు గణనీయంగా జీఎస్టీ రేట్లు తగ్గాయన్నారు. పాపా నాయుడు పేట పంచాయతీ కార్యదర్శి మునెయ్య మాట్లాడుతూ దీర్ఘకాలం లో ప్రభుత్వ ఆదాయం పెరిగి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఉమా, రాఘవరెడ్డి, వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బాలాయపల్లి: జీఎస్టీ పన్నులు తగ్గింపుపై మండలపరిధిలోని, వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం పంచాయితీ కార్యదర్శి దయకర్ ఆద్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళశాల ప్రిన్సిపాల్ కరుణ కుమారి మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యాయంగా మిగిలిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, ఆమందూరు పంచాయతీ ఎస్వి ఎస్ హై స్కూల్ శ్రీ వ్యాశాశ్రమంలో సూపర్ జీఎస్టీ సూపర్ హిట్ పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో 10వ తరగతి విద్యార్థులు సి. మేఘన ప్రథమ, సి. విష్ణు ప్రియ ద్వితీయ, ఎం పల్లవి 9వ తరగతి తృతీయ స్థానం పొందారు. బి చెంచు కీర్తి, కే గాయత్రి, బి శ్రావణిలు డిబేట్ కాంపిటీషన్లో ఉత్తీర్ణులయ్యారు.

నీడలో కార్లు.. ఎండలో భక్తులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారుల తీరు నానాటికీ తీసుకట్టుగా మారుతోందని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి విమర్శించారు. స్థానిక సన్నిధి వీధిలో భక్తుల కోసం రోడ్డు వెంబడి నిర్మించిన రేకుల షెడ్డులను మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులతో కలిసి మంగళవారం బియ్యపు మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. ఆలయాధికారులకు ముందు చూపు లేని కారణంగా భక్తుల సొమ్ము వృధా అవుతోందని ఆయన మండిపడ్డారు. భక్తులకు ఎండలో కాళ్ళు కాలకూడదని మొదట రెడ్ కార్పెట్లు ఏర్పాటు చేశారని చెప్పారు. అనంతరం కూలింగ్ పెయింట్లు వేశారని వివరించారు. తదుపరి రేకుల షెడ్లను నిర్మించారని గుర్తుచేశారు. తీరా రేకుల చెట్ల కింద కార్లను పార్కింగ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్లేమో నీడలో.. భక్తులేమో ఎండలో అన్న చందంగా మారిందని విమర్శించారు. కూటమి నేతలకు కాంట్రాక్టుల రూపంలో దోచి పెట్టాలన్న అధికారుల అనాలోచిత నిర్ణయాలు ముక్కంటి హుండీకి గండి పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తీరు మార్చుకుని ఆలయ అభివృద్ధికి సరైన నిర్ణయాలు తీసుకోవాలని, రేకుల షెడ్ల కింద వాహనాలు కాకుండా భక్తులు నడిచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నకిలీ మద్యంపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నకిలీ మద్యంపై మాట్లాడే అర్హత మాజీ సీఎం జగన్‌కు లేదని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ములకల చెరువులో బయటపడిన కల్తీ మద్యం తయారీ కేంద్రం కేసులో మొత్తం 14 మందిని గుర్తించిన పోలీసులు ఇప్పటికే 10 మందిని అరెస్టు చేశారనీ, టీడీపీ నేతలు జయచంద్రా రెడ్డి, సురేంద్ర నాయుడుల ప్రమేయం పై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. అంతకు ముందుగానే వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయడం కూడా జరిగిందని తెలిపారు. అయితే జగన్ హయాంలో జరిగిన మద్యం కల్తీపై మాట వరసకైనా చర్యలు తీసుకోలేదనీ, పైగా మద్యం మరణాలపై అసెంబ్లీలో వ్యంగ్యంగా మాట్లాడరని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం నకిలీ మద్యం తయారీదారులపై చర్యలు తీసుకోవడమే కాకుండా విచారణకు ఆదేశించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, బీమాల భాస్కర్, వజ్రం కిషోర్, నారాయణ, కోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

● పుత్తేరి పంచాయతీలో అవకతవకలు..!

● ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆరోపణలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో18 వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.వి.శ్రీనివాస్ ప్రసాద్, ప్రెసిడింగ్ అధికారుల పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 28 పంచాయతీల వారీగా జరిగిన సామాజిక తనిఖీ వివరాలను డి.ఆర్.పి లూ చదివి వినిపించారు. మండలం మొత్తం మీద చిన్న చిన్న కొలతలు తేడా మినహా పెద్దగా పొరబాట్లు జరగలేదని తెలిపారు. పుత్తేరి పంచాయతీలో కొంత మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ మీద ఆరోపణలు వచాయన్నారు. అతనిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించారు. మండలం మొత్తం మీద పెనాల్టీగా రూ.72000, రికవరీ రూ.70149, మొత్తం రూ.142149 విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోతి, సోషల్ ఆడిట్ ఎస్.టి.యం కొనయ్య ఎస్.ఆర్.పి లోకేష్ , డిఆర్‌పిలు, అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్ర శేఖర్ రాజు, ఏ.వి.ఓ గణేష్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.